క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో నేడు (సోమవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాపువాడ, అలంకార్, కాకతీయ కాలనీ, గుండ, విజయ డెయిరీ, ఉజిలీస్, గడిమజీద్, జామా మజీద్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

సమ్మర్ క్లాసులు నిర్వహిస్తే చర్యలు

ఎంఈఓ శ్రీధర్

కమలాపూర్ : విద్యాశాఖ ఆదేశాల మేరకు వేసవి సెలవుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని, ఒకవేళ నిర్వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ కె.శ్రీధర్ హెచ్చరించారు. మండలంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో వేసవి తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ ప్రకటన జారీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నియమ, నిబంధనలను పాటించాలని, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పద్మశాలి సంఘం శాశ్వత సభ్యత్వ నమోదు



శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో కార్మికులకు అఖిల భారత పద్మశాలి సంఘం శాయంపేట గ్రామ ఉపాధ్యక్షుడు తుమ్మ ప్రభాకర్ ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం శాశ్వత సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో పద్మశాలీలందరూ సంఘం బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రమౌళి, చేనేత సహకార సంఘం డైరెక్టర్ లక్ష్మీనారాయణ, గోపి పాల్గొన్నారు.

ఘనంగా నృసింహస్వామి జయంతి

దామెర : నృసింహస్వామి జయంతిని పురస్కరించుని మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం 11 గంటలకు శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 4 గంటలకు విశ్వక్సేన పూజ, పున్యాహ వాచనం, అంకురార్పణ, సుదర్శన శిఖర కలశ గ్రామ శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు తూపురాణి శ్రీనివాసచార్యులు వేద మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ



పరకాల : అనారోగ్యంతో మృతిచెందిన బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం పరామర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అధ్యక్షుడు మోరె రాజేందర్ తండ్రి సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి జయపాల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, నాయకులు నక్క చిరంజీవి, మేడిపల్లి శోభన్‌బాబు, పంచగిరి శ్రీను పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో ఒకరి ఆత్మహత్య


సంపత్ రెడ్డి (ఫైల్)

వేలేరు : అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది విషగుళికలు మింగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని మల్లికుదుర్లలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికుదుర్లకు చెందిన గుజ్జుల సంపత్ రెడ్డి (34) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. అతడి ఆర్థిక పరిస్థితులు బాగాలేక కొంత అప్పులు చేశాడు. అయితే చేసిన అప్పులు తీర్చలేక మానసికంగా బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అతడు మరిన్ని అప్పులు చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చలేక, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం విషగుళికలు మింగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం సంపత్‌రెడ్డి మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఇరుకు గదుల్లోనే విధులు

ఇబ్బందుల్లో ట్రాఫిక్ పోలీసులు
- సిబ్బందికి అరకొర వసతులు
- పట్టించుకోని అధికారులు


కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

కాజీపేట : అధికారులు పట్టించుకోకపోవడంతో కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సమస్యలతో సతమతమవుతున్నారు. నగరంలోని అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో అతి పెద్ద స్టేషన్‌గా గుర్తింపు పొందిన ఇక్కడ కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. దీంతో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు వివిధ పనుల నిమిత్తం స్టేషన్‌కు వచ్చే బాధితులు సైతం అష్ట కష్టాలు పడుతున్నారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సీఐ, నలుగురు ఎస్సైలతో పాటు 78 మందికి పైగా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంతమంది సిబ్బంది ఉన్న పోలీస్ స్టేషన్‌లో అగ్గిపెట్టేంత రెండు గదులు మాత్రమే ఉండటంతో అధికారులు, సిబ్బంది ఒక్కసారి స్టేషన్‌లో ఉండే పరిస్థితులు లేదు. ఉన్న గదుల్లోనే సిబ్బందితోపాటు అధికారులు అతి కష్టం మీద పని చేస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, ఈ–చలాన్ తదితర అంశాలపై అధికారులతో చర్చించేందుకు వచ్చే బాధితులు ఎంతోమంది నిత్యం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో స్టేషన్‌లో కూర్చునే మాట దేవుడేరుగు.. కనీసం నిలబడే జాగా లేకుండా పోయింది. ఏసీపీ స్థాయి అధికారి స్టేషన్‌లో ఉంటే సీఐ, ఎస్సై స్థాయి అధికారులు సైతం కూర్చోవడానికి సరైన స్థలం లేదు. ఇద్దరు అధికారులు చక్కగా పోలీస్ స్టేషన్‌లో ఉంటే ఎవరైనా ముఖ్యఅతిథి స్టేషన్‌కు వస్తే కూర్చోవడానికి కుర్చీలుండవు, ఉన్న వేయడానికి స్థలం ఉండదు. ఇరుకు గదుల్లోనే నాలుగు కంప్యూటర్లు, ఫర్నిచర్, ప్రింటింగ్ సామగ్రి ఉండడంతో కింది స్థాయి సిబ్బంది పడుతున్న బాధలు వర్ణాణాతీతం. స్టేషన్‌కు బాధితులను కూర్చోబెట్టి నిదానంగా సాధకబాధకాలు తెలుసుకోవాలని అధికారులు చెబుతున్నా, మాటలకు చేతలకు ఎక్కడ పొంతన కుదరడం లేదనే విమర్శలున్నాయి. ఇటీవలి పోలీస్ స్టేషన్ తనిఖీలకు వచ్చిన అధికారులు వసతి లేమి వల్ల కలుగుతున్న ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేస్తామని మాట ఇచ్చిన ఫలితం లేకుండా పోయిందంటున్నారు.

అధికారులకు విన్నవించాం..

ట్రాఫిక్ సిబ్బందికి భవనం సరిపోవడం లేదు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. కొద్దిరోజుల్లోనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమస్య పరిష్కారం అవుతుందని అనుకుంటున్నాం.

– నాగబాబు, ట్రాఫిక్ సీఐ, కాజీపేట

సమావేశాల నిర్వహణ కష్టమే..

సిబ్బందికి పీఎస్‌లో సమీక్ష సమావేశం నిర్వహించాలంటే వసతి లేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. నలుగురు ఎస్సైలు, సీఐ స్టేషన్‌లో ఉంటే కిందిస్థాయి సిబ్బంది బయట నిలబడాల్సిందే. స్టేషన్‌లో సిబ్బందికి కనీస సౌకర్యాలు, మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేవు. పోలీస్ స్టేషన్ ఆవరణలో విశాలమైన స్థలం ఉండగా, కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ స్పందించి తగు నిధులు మంజూరు చేసి ఆధునాతన సౌకర్యాలతో కొత్త భవనం నిర్మించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

శబరిమల యాత్రికులకు అన్నదానం

ఘనంగా అయ్యప్ప ధర్మప్రచార సమావేశం


సమావేశంలో పాల్గొన్న సంఘం సభ్యులు

హన్మకొండ కల్చరల్ /నయీంనగర్ : అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ తెలంగాణ రాష్ట్ర వార్షికోత్సవ జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. హనుమకొండ కేయూ క్రాస్‌రోడ్ వద్ద ఉన్న ఓ బాంకెట్ హాల్‌లో సభ్యులు టీవీ పుల్లం రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్‌రావు, ఉమ్మడి రాష్ట్రాల కన్వీనర్ రాచర్ల రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుల్లం రాజు మాట్లాడుతూ శబరిమల వెళ్లే మార్గంలో నారాయణ్‌తోడ్ వద్ద అన్నదాన సత్రంలో దేవాలయం తెరిచి ఉన్న ప్రతిరోజు యాత్రికులకు అన్నప్రసాదాల వితరణ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాకు చెందిన కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రచారసభ రాష్ట్ర కార్యదర్శి దుశెట్టి భాస్కర్, జాతీయ ఉపాధ్యక్షుడు విలాసాగరం వీరస్వామి, రాష్ట్ర కోశాధికారి పోతురాజుల రమేష్, జోనల్ సెక్రటరీ రవిరాజ్, నగేష్, సాగర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి దేవాలయంలో హోమం


హోమం నిర్వహిస్తున్న ఈఓ, సిబ్బంది

హన్మకొండ కల్చరల్ : ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా పూర్తవ్వాలని భారత సైన్యం, దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం శ్రీ భద్రకాళి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, చండీహోమం నిర్వహించారు. ఈఓ శేషుభారతి ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు చెప్పెల నాగరాజుశర్మ, అర్చకులు నాగరాజుశర్మ, ప్రదీప్ శర్మ సురేష్ శర్మ, అరవిందశర్మ, పర్యవేక్షకులు విజయ్‌కుమార్, హరినాథ్, అశోక్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ


అంజన్నకు పెరుగుతో అభిషేకం


పత్రికను ఆవిష్కరిస్తున్న భక్తులు, అర్చకులు

కాజీపేట : కాజీపేటలో కొలువుదీరిన దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారికి 108 లీటర్ల పెరుగుతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఈ నెల 22న జరిగే హనుమాన్ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అనగం యాదగిరి, మిట్టపల్లి రవీందర్, బెదరకోట రంజిత్ కుమార్, వెంకట్, చిలువేరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

‘అందాల పోటీలు రద్దు చేయాలి’

ఖిలా వరంగల్ : అందాల పోటీలను వెంటనే రద్దు చేయాలని, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఐద్వా వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ శివనగర్ ఏసీరెడ్డి నగర్‌లోని రఘునాథ్ భవనంలో ఐద్వా జిల్లా కోశాధికారి రంగరాజు విజయ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రత్నమాల హాజరై మాట్లాడారు. ప్రజలు సామాజిక, ఆర్థిక, సమస్యలతో సతమతమవుతూ.. మరో వైపు భారత్–పాకిస్తాన్ల మధ్య కాల్పులు యుద్ధ, భీకర పోరాటం జరుగుతున్న తరుణంలో అందాల పోటీలు నిర్వహించటం సరికాదని విమర్శించారు. వెంటనే అందాల పోటీలను రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ జరీనా, అనిత, దివ్య, జ్యోతి, సరోజన, నీలక్క, లక్ష్మక్క, శారద తదితరులు పాల్గొన్నారు.

మహిళలను అరెస్టు చేయడం దుర్మార్గం

హన్మకొండ : హైదరాబాద్ గచ్చిబౌలిలో ప్రారంభమైన అందాల పోటీలను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపిన మహిళా కార్యకర్తలను అరెస్టు చేయడం దుర్మార్గమని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ కళావతి, కో కన్వీనర్ అనిత పేర్కొన్నారు. భారతీయ స్త్రీల శరీరాలను అంతర్జాతీయ పెట్టుబడిదారులకు సరుకుగా ఉపయోగించుకోవడానికి, విలాస వస్తువుగా మార్చడానికే ఈ అందాల పోటీలను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్నారని వెల్లడించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదన ఆమోదించడం వల్లనే తెలంగాణ ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహిస్తోందని వారు ఒక ప్రకటనలో విమర్శించారు. మహిళలను అరెస్టు చేయడాన్ని వారు ఖండించారు. పహల్గాం సంఘటనతో తీవ్ర భావోద్వేగపు పరిస్థితులను సమాజం ఎదుర్కొంటుందని, భారతదేశంలో ఉన్నటు కార్మిక సంఘాలన్నీ ఈనెల 20వ తేదీన బంద్‌కు పిలుపునిస్తున్న పరిస్థితుల్లో ఎవరీ కోసం అందాల పోటీలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు.

గంజాయికి అలవాటు పడి.. విక్రయాలు


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ దుర్గాభవాని

కాజీపేట అర్బన్ : గంజాయికి అలవాటు పడిన యువకుడు అదే గంజాయిని అక్రమార్జనకు విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డ సంఘటన ఆదివారం జరిగింది. హనుమకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాభవాని కథనం ప్రకారం. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ఎన్డీపీఎస్ స్పెషల్ డ్రైవ్‌ను హనుమకొండలోని పరిమళకాలనీలో నిర్వహించారు. అనుమానాస్పదంగా ముగ్గురు యువకులు శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో చేతిలో సంచితో సంచరిస్తుండగా పట్టుకుని విచారించామని తెలిపారు. కుందెల ఇంద్రతేజ, తమ్మే భానుతేజ, బెల్లం అరవింద్‌లు 700 గ్రాముల గంజాయితో పట్టుబడ్డారు. హైదరాబాద్‌లోని దూల్‌పేటలో అపరిచిత వ్యక్తుల నుంచి కుందెల ఇంద్రతేజ గంజాయిని కొనుగోలు చేసి గంజాయికి అలవాటు పడి తాను ఆర్థికంగా ఎదిగేందుకు గంజాయి విక్రయాలను కొనసాగిస్తున్నాడని చెప్పారు.కాగా మరో ఇద్దరు యువకులు ఇంద్రతేజ వద్ద గంజాయి కొనుగోలు చేసి సేవిస్తామని ఒప్పుకున్నారు. ముగ్గురి నుంచి రూ.13వేల విలువైన 700 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. కార్యక్రమంలో ఎస్సైలు వెంకన్న, చందు, క్రిష్ణమూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ఖిలా వరంగల్ : వరంగల్ శంభునిపేటలో తాజ్ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇటీవల డిప్యూటీ కలెక్టర్ ర్యాంక్ సాధించిన విలాయత్, కానిస్టేబుళ్లు, మక్కా యాత్రికులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంఘం అధ్యక్షుడు మహమ్మద్ యాకూబ్ హాజరై వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖలీల్, అజ్మీర్, జలీల్, తయ్యబ్, ఇస్మాయిల్, మన్నాన్, ఖదీర్, యాకూబ్ పాల్గొన్నారు

సమష్టి కృషితోనే కాలనీ అభివృద్ధి సాధ్యం



వరంగల్ : కాలనీ సభ్యులంతా సమష్టిగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని మధురానగర్ కాలనీ పరపతి సంఘం నూతన అధ్యక్షుడు అలువాల సదాశివుడు అన్నారు. ఆదివారం 14వ డివిజన్‌లోని మధురానగర్ కాలనీ పరపతి సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం నివేదికను ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, ఆదాయ, వ్యయాలను కోశాధికారి కుమారస్వామిలు సభ్యులకు వివరించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అలవాల సదాశివుడు, ఉపాధ్యక్షుడిగా షేక్ ఇమామ్, ప్రధాన కార్యదర్శిగా గూడూరు ఎల్లయ్య, కోశాధికారిగా పుచ్చ కుమారస్వామి, గౌరవ అధ్యక్షుడిగా బొడిగె సుదర్శన్, సమన్వయకర్తగా చిగురుమామిడి రాజమౌళి, ముఖ్య సలహాదారులుగా గుండా రవీందర్, కదం రాములు, బిల్లకంటి రాజేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా ఆడెపు శ్రీనివాస్, బోడ జవహర్ లాల్, వేల్పూరి ఈశ్వరరావు, పాక కృష్ణ, ఆకారపు రవి, చిలగాని రమేష్, దాసరి రాజు, కంచు శ్రీనివాస్, సంస్కృత, యూత్ కార్యదర్శిగా బట్టు సుమంత్, మహిళా విభాగం సమన్వయ కర్తగా బండారి సునీతను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మొబైల్ ఫర్టిలిటీ క్యాంపు



హన్మకొండ : తెలుగు రాష్ట్రాల్లోని 30 పట్టణాల్లో ఉచిత మొబైల్ ఫర్టిలిటీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఒయాసిస్ ఫర్టిలిటీ సైంటిఫిక్ హెడ్, క్లినికల్ ఎంబ్రియాలిజిస్టు డాక్టర్ కృష్ణ చైతన్య తెలిపారు. మాతృత్వానికి ప్రతీకగా ఒయాసిస్ జననీ యాత్ర చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హనుమకొండలోని ఒయాసిస్ జననీ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ మదర్స్ డేను పురస్కరించుకుని మొత్తం 30 రోజుల పాటు 30 పట్టణాల్లో ఒయాసిస్ జననీ యాత్ర చేపట్టి ఉచిత మొబైల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ జలగం కావ్య రావు మాట్లాడుతూ సంతానలేమి కారణాలపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



ఎల్కతుర్తి : మండలంలోని కోతులనడుమ గ్రామంలో ఆదివారం శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. మొదటి రోజు గ్రామ పర్యటన, జలాధివాసం, యాగశాల ప్రవేశం పూజలు నిర్వహించారు. శనివారం సామూహిక హోమాలు, యాగశాల క్రమాలు, కుంకుమార్చనలు జరిగాయి. 11న యంత్ర ప్రతిష్ఠాపన, పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం అన్నప్రసాద వితరణ జరిగింది. 12న ఎల్లమ్మ పౌర్ణమి సందర్భంగా పట్నాలు, బోనాలు నిర్వహించనున్నారు, 13న అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. విగ్రహ కమిటీ అధ్యక్షుడు శ్రీపతి రవీందర్‌గౌడ్, సభ్యులు భాస్కర్, సంపత్, తిరుపతి, రవి పాల్గొన్నారు.

హమాలీలను ఉద్యోగులుగా గుర్తించాలి

- సివిల్ సప్లయీస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజు

ఖిలా వరంగల్ : సివిల్ సప్లయీస్ గోదాముల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, వయో పరిమితి 57 నుంచి 61 సంవత్సరాలకు పెంచాలని సివిల్ సప్లయీస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని సివిల్ సప్లయీ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ అధ్యక్షతన హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా మూడో మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. సివిల్ సప్లయీ హమాలీ వర్కర్స్‌కు కనీసం రూ.26వేల వేతనం ఇవ్వాలని, మండల పాయింట్ల వద్ద సొంత గోదాములు నిర్మించాలన్నారు. కార్మికుల విరమణ సమయంలో రూ.10లక్షల రిటైర్డ్ బెనిఫిట్ ఇవ్వాలని, ప్రమాదంలో మరణించినా, అంగవైకల్యం చెందిన రూ.10లక్షల పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు దేవసబోయిన రాంబాబు, గుపెల్లి మునీశ్వర్, ఉపాధ్యక్షులుగా జలగం భిక్షపతి, నర్సింగం, మునీశ్వర్, రవి, చంద్రమౌళి, మహేందర్ నియామితులయ్యారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాషమియా, పనాస ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, మునిశ్వర్, దండు లక్ష్మణ్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కాజీపేట : కాజీపేట మండలం సోమిడి శివారులోని ఆర్‌కే హిల్స్‌లో ఆదివారం కాజీపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1991–92వ సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ఉద్యోగాలు, అవసరాల రీత్యా అనేక ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులంతా ఒకచోటకు చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. దర్గాకాజీపేట ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ కాయిత రాజ్‌కుమార్ యాదవ్, మెప్మా సీఈఓ సకినాల రమేశ్, పోలీస్ అధికారి పల్లెబోయిన సురేందర్, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో పారిశుద్ధ్య పనులు


పూడికతీత పనులు చేస్తున్న సిబ్బంది

కాజీపేట : కాజీపేట పట్టణం బాపూజీనగర్ కాలనీలోని మురుగు కాల్వల్లో పూడికతీత పనులను పారిశుద్ధ్య సిబ్బంది కొనసాగిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో 25 మంది సిబ్బంది సైడ్ కాల్వల్లో పూడిక తీత పనులను చేపట్టారు. వర్షకాలం ఆరంభంలోగా కాల్వల్లో పేరుకుపోయిన పూడికను తొలగించాలనే లక్ష్యంతో పనులను వేగవంతం చేశారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

- సీఐ సుధాకర్

కాజీపేట : వేసవి సెలవుల నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సుధాకర్ రెడ్డి కోరారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. సెలవుల నేపథ్యంలో ఇప్పటికే పీఎస్ పరిధిలో పెట్రోలింగ్ ముమ్మరం చేశామని తెలిపారు. కాలనీల్లో అనుమానిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కాలనీవాసులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రజలు ఊర్లెళ్లే ముందు నమ్మకంగా ఉంటే ఇరుగుపొరుగు వారికి లేదంటే బంధువులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే త్వరగా ప్రయాణం ముగించుకు తిరిగి రావాలన్నారు. నగదు, విలువైన వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో ఇంట్లో పెట్టి వెళ్లొదని, విలువైన వస్తువులు బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలన్నారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నా.. డయల్ 100 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉచిత ధ్యాన–ఆత్మజ్ఞాన శిక్షణ ప్రారంభం

మడికొండ : కాజీపేట మండలం మడికొండలోని వాసవి కమ్యూనిటీ హాల్‌లో ఉచిత ధ్యాన–ఆత్మజ్ఞాన శిక్షణను ఆదివారం మడికొండ వాసవి సమితి అధ్యక్షుడు దొంతుల సమ్మయ్య ప్రారంభించారు. సుభాష్ పత్రీజీ దివ్య ఆశీస్సులతో 15 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. ధ్యానంతో ఏకాగ్రత ఏర్పడుతోందని, మనసు అదుపులో ఉంటుందని అన్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సమ్మయ్య కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, రవీందర్, రామ్మూర్తి, ఆనంద్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గృహకల్పలో నల్లాల ఏర్పాటు


నల్లాలను ప్రారంభిస్తున్న రాజారపు స్వామి, చిత్రంలో కాలనీవాసులు

కాజీపేట అర్బన్ : గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ పరిధిలోని కడిపికొండ గ్రామంలోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలో మిషన్ భగీరథ నీటికోసం నల్లాలను ఆదివారం ఏర్పాటు చేసి ప్రారంభించారు. రాజీవ్‌గృహకల్ప సముదాయంలోని నిరుపేదలు తమకు తాగునీటికి గల ఇబ్బందులను 44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కంటెస్టెడ్ కార్పొరేటర్ రాజారపు స్వామికి ఇటీవల తెలియజేశారు. స్పందించిన స్వామి సొంత ఖర్చులతో తాగునీటి నల్లాలను ఏర్పాటు చేసి, ఆదివారం ప్రారంభించారు. నల్లాలు ఏర్పాటు చేసి ఔదార్యం చాటుకున్న రాజారపు స్వామికి రాజీవ్‌గృహకల్ప వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ, రాజీవ్ గృహకల్ప కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.